

పూర్తికాని సర్వే

మేడ్చల్ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో వర్షాల కారణంగా 56 కిలోమీటర్ల మేర 24 రోడ్లు దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతుల కోసం రూ.34 కోట్లు మంజూరయ్యాయి. హ్యామ్ పద్ధతిలో జిల్లాలో ఆర్అండ్‌బీ అధికారులు 46 కిలోమీటర్లు, పీఆర్ అధికారులు 140 కిలోమీటర్లకు ప్రతిపాదనలు పంపారు. వాటికి ఇంకా సర్వే పనులు పూర్తి కాలేదు. సర్వే పూర్తయితే అనుమతులు వస్తాయని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో కొత్త రోడ్లు, విస్తరణ సైతం చేపట్టలేదు. గతంలో నిర్వహించిన కొన్ని రోడ్ల పనులకు కాంట్రాక్టర్లకు ఇప్పటి వరకు బిల్లులు చెల్లించని పరిస్థితి



ఆయన విద్యాభ్యాసమంతా ఇంగ్లిష్ మీడియంలోనే సాగింది. ఉపాధ్యాయ వృత్తిలోనూ ఆంగ్లం పాఠాలనే బోధిస్తున్నాడు. కానీ ఆయనకు తెలుగు భాషపై ఉన్న మక్కువతో సాహిత్యంలో మెరిసిపోతున్నాడు. ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేస్తూనే రంగుల ప్రపంచం(సినిమా రంగం)లోకి అడుగుపెట్టి ఔరా అనిపించుకుంటున్నాడు ఉపాధ్యాయుడు ద్యావరి నరేందర్‌రెడ్డి.

నగా దారిలో..

మొదటి సినిమా పాటతోనే మంచి గుర్తింపు
ఆకట్టుకున్న 'విరాటపర్వం' లోని నగాదారిలో పాట
ఇంగ్లిష్ టీచర్ అయినా తెలుగుపై అమితమైన ప్రేమ
అనేక పద్యాలు, పాటలు, గజల్స్ రచన
ఉపాధ్యాయుడు నరేందర్‌రెడ్డి ప్రతిభపై ప్రత్యేక కథనం

Sunday Special

పెద్దేముల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లా పెద్దేముల్ గ్రామంలోని నారాయణమ్మ, చిన్నరాంరెడ్డి దంపతుల కుమారుడు ద్యావరి నరేందర్‌రెడ్డి. వారిది రైతు కుటుంబం. నరేందర్‌రెడ్డి పెద్దేముల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన వృత్తి రీత్యా విద్యార్థులకు

మిగతా 7వ పేజీలో...



విరాటపర్వం సినిమా హీరో రాణా, హీరోయిన్ సాయిపల్లవిలతో నరేందర్‌రెడ్డి(ఫైల్)

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆర్అండ్‌బీ, పంచాయతీ రహదారులు కంకర తేలి, గుంతలు పడి దారుణంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల రోడ్లపై వాహనాలను నడపాలంటేనే బెంబేలెత్తుతున్నారు. ఛిద్రమైన దారుల్లో ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. ధ్వంసమైన రోడ్లపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి. పదేళ్ల క్రితం వేసిన రోడ్లన్నీ ప్రస్తుతం 'అడుగుకో గుంత.. గజానికో గొయ్యి'లా మారాయి. పాడైన వాటికి మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణాలు.. ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. అస్తవ్యస్తంగా ఉన్న దారులపై ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉమ్మడి జిల్లాలో 500 కిలోమీటర్ల మేర రోడ్లకు తక్షణ మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది.



ఛిద్రమైన మోమిన్‌పేట నుంచి శంకర్‌పల్లి వెళ్లే రోడ్డు

రహదారుణం!



కంకర తేలి గుంతలు పడిన పోతారం నుంచి అనంతారంకు వెళ్లే రోడ్డు

ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా రోడ్లు
పాడైన ఆర్అండ్‌బీ, పంచాయతీ దారులు
నరకం చూస్తున్న వాహనదారులు
తరచూ ప్రమాదాలతో బెంబేలు
మరమ్మతులు ప్రతిపాదనలకే పరిమితం
చేసిన పనులకూ అందని బిల్లులు
ముందుకు రాని కాంట్రాక్టర్లు
పట్టించుకోని పాలకులు, అధికారులు

అడుగుకో గుంత.. గజానికో గొయ్యి

వికారాబాద్/మేడ్చల్, మే 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 934 కిలో మీటర్ల మేర ఆర్అండ్‌బీ, పంచాయతీ రోడ్లు దెబ్బతిన్నాయి. తక్షణ మరమ్మతులు చేపట్టాల్సినవి 500 కిలో మీటర్లు ఉన్నాయి. రోడ్ల మరమ్మతుకు కొన్ని ప్రాంతాల్లో నిధులు మంజూరైనప్పటికీ బిల్లులు పెండింగ్ ఉండటంతో కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రావడం లేదని తెలుస్తోంది. దీంతో రోడ్ల మరమ్మతులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. రంగారెడ్డి జిల్లాలో 113కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ, పీఆర్ రోడ్లు దెబ్బతిన్నాయి. ఇందులో 15రోడ్లకు తక్షణం మరమ్మతులు చేయాల్సి ఉంది. కానీ, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఆయా ప్రజలు ఆరోపిస్తున్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో 41 కిలోమీటర్ల మేర రోడ్లు పాడవగా, వీటి మరమ్మతుల కోసం రూ.220 కోట్లు ప్రతిపాదనలు పంపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పంపించిన ప్రతిపాదనలకు నేటికీ మోక్షం కలగడం లేదు. నిధుల మంజూరు కోసం ఎదురుచూపులు

మిగతా 7వ పేజీలో...

నీట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

వికారాబాద్‌లో హాజరుకానున్న 1,193,
మేడ్చల్‌లో 4,336 మంది అభ్యర్థులు

వికారాబాద్/మేడ్చల్, మే 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నేషనల్ టెస్ట్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆదివారం నిర్వహించనున్న నీట్ - యూజీ -2024 పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వికారాబాద్ పట్టణంలో జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, ఎన్నేపల్లిలోని సంగం లక్ష్మీబాయి బాలికల గురుకుల పాఠశాల, కొత్తగడి, అనంతగిరిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారు. నీట్ రాసేందుకు 1,193 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. విద్యార్థులను పూర్తి స్థాయిలో తనిఖీ చేసిన తర్వాతనే అనుమతించనున్నారు. అభ్యర్థుల కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నారు. ఇదిలా ఉంటే, పరీక్ష నిర్వహణపై నీట్ సిటీ కోఆర్డినేటర్ సాయిలత, డిప్యూటీ కో ఆర్డినేటర్ కుమారస్వామి శనివారం ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇచ్చారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట హాల్‌టికెట్(అడ్మిట్ కార్డు)తో పాటు రెండు పాస్‌పోర్ట్, ఒక స్టాంప్‌సైజ్ ఫొటో మాత్రమే తీసుకు రావాలని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ కుమారస్వామి తెలిపారు. కాగా, పరీక్ష ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ నారాయణరెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.

వికారాబాద్‌లో 5, మేడ్చల్‌లో 13 సెంటర్లు



సెంటర్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో నేడు జరుగనున్న నీట్ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం నీట్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 13 కేంద్రాలను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 4,336 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి ఉదయం 11 గంటల నుంచి 1.30 గంటల వరకు అనుమతిస్తారని, మధ్యాహ్నం 1.30 గంటలకు గేట్లు మూసివేయనున్నట్లు వివరించారు. కలెక్టర్ వెంట జెఎన్‌టీయూ వైస్ ప్రిన్స్‌పాల్ పద్మజ, ఆర్డీవో శ్యాంప్రకాశ్, మూడుచింతలపల్లి, ఘట్‌కేసర్, మల్కాజిగిరి, దుండిగల్, బాలానగర్, కూకట్‌పల్లి తహసీల్దార్లు ఉన్నారు.

అర్హత కలిగిన వైద్యులనే ఆశ్రయించాలి



రిహాబిలిటేషన్ సెంటర్‌ను సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌వో ఉమాగౌరి

మేడ్చల్ ప్రతినిధి, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రజలు అనధికారిక కేంద్రాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవానికి అర్హత కలిగిన వైద్యులు, రిజిస్టర్డ్ సంస్థలను మాత్రమే ఆశ్రయించాలని జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని పర్వతాపూర్, మేడిపల్లి మల్లికార్జునగర్‌లోని శ్రద్ధా డీ అడిక్షన్ సెంటర్, రిహాబిలిటేషన్ సెంటర్‌ను ఆమె తనిఖీ చేశారు. ఇటీవల అక్కడ ఓ రోగి మృతి చెందిన నేపథ్యంలో తనిఖీ నిర్వహించారు. అక్కడ అర్హతలు లేని వారు చికిత్స నిర్వహిస్తున్నట్లు గుర్తించిన అధికారులు ఆ సెంటర్‌ను సీజ్ చేశారు. తనిఖీల్లో జిల్లా ఉప వైద్యాధికారి సత్యవతి, బాలల సంక్షేమ శాఖ సీడీపీవో స్వాతి, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగ

ఉదయం తొమ్మిది గంటలకే ఉగ్రరూపం
ఉక్కిరిబిక్కిరి అవుతున్న జిల్లా ప్రజలు
దుద్యాల్‌లో 42.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



నిర్మానుష్యంగా చౌరస్తా

వికారాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం తొమ్మిది గంటలకే ఎండలు ఉగ్రరూపం దాలుస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి అవుతున్నా వేడి తగ్గని పరిస్థితి. మే నెలలో మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడంతో భవన కార్మికులు, ఉపాధి కూలీలు పనులకు ఇక్కట్లు తప్పడం లేదు.

సాయంత్రం మేఘావృతం

ప్రచండభానుడు ఉగ్రరూపం దాలుస్తుండడంతో వికారాబాద్ జిల్లాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం జిల్లాలో అత్యధికంగా దుద్యాలలో 42.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలో 29 ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రతల్లో 20 చోట్ల 40 డిగ్రీలకు పైగానే నమోదు కావడం గమనార్హం. దారూరు, మర్పల్లిలో 42.4 డిగ్రీలు, కొడంగల్‌లో 42.2, నాగారం (తొరమామిడి)లో 42.0 డిగ్రీలు నమోదయ్యాయి. మోమిన్‌పేట్‌లో 41.9, దౌల్తాబాద్‌లో 41.5, వికారాబాద్, బంట్వారంలో 41.3, నవాబ్‌పేట్‌లో 41.2, కోట్‌పల్లి, తాండూరు ఏఆర్ఎస్‌లో 41.1, మదన్‌పల్లిలో 41.0, దోమలో 40.9, దావలాపూర్, తాండూరు, యాలాల్‌లో 40.8, ఖాసీంపూర్‌లో 40.3, బషీరాబాద్‌లో 40.2, పెద్దేముల్‌లో 40.1 డిగ్రీలు నమోదయ్యాయి. ఒకవైపు శుభకార్యాలు ఉండడం, మరోవైపు ఎండలు ముదరడంతో ప్రజలు బేజారవుతున్నారు. ఇదిలా ఉంటే, శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి వాతావరణం చల్లగా మరింది. ఆకాశం మేఘావృతం కావడంతో ఒక్కసారిగా వేడి తగ్గిపోయింది.

ఉద్యాన సాగును ప్రోత్సహించాలి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సృజన



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కమిషనర్ సృజన

నవాబుపేట/మోమిన్‌పేట్, మే3(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద ఉద్యావన పంటలు సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహించాలని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ సృజన అధికారులకు సూచించారు. శనివారం వికారాబాద్ జిల్లా నవాబుపేట, మోమిన్‌పేట్ మండలాల్లో ఆమె పర్యటించారు. ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన పంటలతో పాటు మునగ, జామ, మామిడి, సీతాఫల్ పంటలను సాగు చేసుకొని మార్కెటింగ్ చేసేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం వట్టిమీనపల్లిలోని నర్సరీ, నవాబుపేట గ్రామ సమీపంలో చేపడుతున్న ఫామ్‌పండ్ పనులను పరిశీలించారు. అలాగే ఉపాధి నిధులతో నిర్మించిన పౌల్ట్రీ ఫారంను ఆమె ప్రారంభించారు. ఆమెతో పాటు కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు పర్యటించారు.

జాతిపితకు నివాళి

అక్కడి నుంచి చీమలదరిలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆధార్ కేంద్రం, పార్కు, కంపోస్టు ఎరువు తయారీ షెడ్‌ను పరిశీలించారు. చీమలదరి గ్రామానికి ఉత్తమ పంచాయతీగా అవార్డు రావడం హర్షించాల్సిన విషయం అన్నారు. అభివృద్ధికి సహకరించిన ప్రజలు, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డిని ఆమె అభినందించారు. అనంతరం పంచాయతీ ఆవరణలో జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీవో జయసుధ, పంచాయతీరాజ్ శాఖ అధికారి ఉమేశ్, ఎంపీడీవోలు అనురాధ, విజయలక్ష్మి, ఏపీవో లక్ష్మీదేవి, ఎంపీవో యాదగిరి, ఏపీవో శంకరయ్య, పంచాయతీ కార్యదర్శి భరత్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

కీసర, మే3(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగించుకోవాలని కలెక్టర్ గౌతమ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు భూ భారతి చట్టం-2025 చట్టంపై అవగాహన కల్పిస్తూ, సమస్యలను పరిష్కరించేందుకు కీసరను పైలట్ మండలముగా ఎంచుకున్నట్లు తెలిపారు. 5 నుంచి 13వ తేదీ వరకు కీసర మండల రెవెన్యూ పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. మే 5వ తేదీన ధర్మారం, నర్సంపల్లి, 6న తిమ్మాయిపల్లి, యాద్గార్‌పల్లి ఈస్ట్, వెస్ట్, 7న కీసర, చీర్యాల్, 8న హరిదాస్‌పల్లి, కీసర దాయారా, 9న అహ్మద్‌గూడ, నాగారం, భోగారం, 12న కుందన్‌పల్లి, రాంపల్లి, 13న గోధుమకుంటలో సదస్సులు నిర్వహించనున్నారు.

పదిలో తడబాటు!

అధ్వాన ఫలితాలపై ఆందోళన
మ్యాథ్స్, సైన్స్‌లో 4,113 మంది ఫెయిల్
ప్రధాన సబ్జెక్టులపై కరువైన పట్టింపు
అధికారుల పర్యవేక్షణపై అనుమానాలు
సప్లిమెంటరీకి ప్రత్యేక తరగతుల నిర్వహణకు డిమాండ్



సబ్జెక్టుల వారీగా జిల్లాలో ఫెయిలైన విద్యార్థులు

సబ్జెక్టులు	ఫెయిలైనవారు
మ్యాథమెటిక్స్	2,639
సైన్స్	1,474
ఇంగ్లిష్	587
తెలుగు/ఉర్దూ	298
సోషల్ స్టడీస్	202
హిందీ	86

వికారాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో వికారాబాద్ జిల్లా చివరి స్థానంలో నిలవడానికి ప్రధాన సబ్జెక్టుల్లో విద్యార్థులకు పట్టు లేకపోవడమేననేది మరోసారి స్పష్టమైంది. అధిక సంఖ్యలో విద్యార్థులు గణితం, సామాన్యశాస్త్రం, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో కనీస మార్కులు సాధించ సాధించలేకపోయారు. వీటితో పాటు మాతృభాష తెలుగు/ ఉర్దూ, సోషల్ స్టడీస్‌లోనూ విద్యార్థులు తడబడ్డారు. అలాగే హిందీలో 86 మంది ఫెయిల్ అయ్యారు. గతేడాది పదో తరగతి ఫలితాల్లో జిల్లా 65.10 శాతం ఉత్తీర్ణతతో 33వ స్థానంలో నిలువగా, ఈ ఏడాది 73.97 శాతంతోనూ 33వ స్థానంలోనే నిలిచిన విషయం తెలిసిందే. గతేడాది కంటే 14.51 శాతం ఉత్తీర్ణత పెరగడం కొంత ఊరటనిస్తున్నా... రాష్ట్ర స్థాయిలో జిల్లా స్థానం మాత్రం మారకపోవడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత మార్చిలో 12,846 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 9,502 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించిన విషయం తెలిసిందే.

ఎక్కువగా ఆ రెండు సబ్జెక్టుల్లోనే..

విద్యార్థులు ఎక్కువగా మేథమెటిక్స్, సైన్స్ సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడం గమనార్హం. గణితంలో 10,207 మంది ఉత్తీర్ణత సాధించగా, 2,639 మంది ఫెయిల్ అయ్యారు. సైన్స్‌లో 11,372 మంది ఉత్తీర్ణులు

మిగతా 8వ పేజీలో...

తాండూరులో దోస్త్ సహాయ కేంద్రం

తాండూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీస్ తెలంగాణ(దోస్త్) జిల్లా స్థాయి సహయ కేంద్రాన్ని శనివారం తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభించారు. హైదరాబాద్ రోడ్డులోని డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. లక్ష్మణ్ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలు పొందే విద్యార్థులు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కేంద్రం ద్వారా అడ్మిషన్ ప్రక్రియ సులువుగా ఉంటుందని, పేర్ల నమోదు, ఆధార్, ధ్రువీకరణ, వెబ్ ఆప్షన్ నమోదు తదితర సేవలను ఈ కేంద్రం ద్వారా పొందొచ్చని తెలిపారు. డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి సింగిల్ విండో ద్వారా విద్యార్థులు సేవలను పొందొచ్చన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. కళాశాల దోస్త్ సమన్వయకర్తగా ఎస్.మహేందర్‌రెడ్డి వ్యవహరిస్తారని చెప్పా రు. టెక్నికల్ కోఆర్డినేటర్లుగా సీహెచ్.కిషన్, ఆర్.అమర్‌ల ను నియమించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు షరీఫా, అమర్, హరికృష్ణ, రవి, ఆశప్ప, అనంతరామ్ పాల్గొన్నారు.

వాట్సాప్ నంబర్: దోస్త్‌లో కొత్త సదుపాయలు కల్పించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులు వాట్సాప్ నంబర్ 7901002200 ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవచ్చునని, గూగుల్ ప్లేస్టోర్ నుంచి దోస్త్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. మొబైల్ నంబర్లు 9885583432(మహేందర్‌రెడ్డి), 9959531273(కిషన్), 9849432029(అమర్)లలో సంప్రదించొచ్చని చెప్పారు.



జిల్లా స్థాయి దోస్త్ సహాయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మణ్

లైబ్రరీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

చేవెళ్ల, మే 3(ఆంధ్రజ్యోతి): చేవెళ్లలో నిర్మిస్తున్న గ్రేడ్1 లైబ్రరీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం నిర్మాణంలో ఉన్న లైబ్రరీ పనులను ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్లలో అన్ని హంగులతో రూ.2కోట్లతో గ్రేడ్‌వన్ లైబ్రరీ నిర్మించడం జరుగుతుందన్నారు. పనుల విషయంలో నాణ్యత ప్రణాలు పాటించాలన్నారు. నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. గ్రేడ్‌వన్ లైబ్రరీ చేవెళ్ల ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ముడిమ్యాల్ పీఏసీఎస్ ఛైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండుయాదవ్, సీనియర్ నాయకులు చేవెళ్ల స్వామి, మాజీ సర్పంచ్ దావల్‌గారి గోపాల్‌రెడ్డి, నాయకులు, అధికారులు తదితరులు ఉన్నారు.



లైబ్రరీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి తదితరులు

ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ

కందుకూరు, మే 3(ఆంధ్రజ్యోతి): ఓటర్ నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటుహక్కు ఉండొద్దని, త్వరలో బీఎల్‌వోలతో ఓటర్ లిస్టుల పరిశీలన చేపడుతామని ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం తన కార్యాల యంలో రాజీకాయ పార్టీ నాయకులు, అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పోలింగ్ కేంద్రానికి 3కిలోమీటర్ల దూరంలో 20మందికి పైగా ఉంటే వారికి కొత్తగా పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. త్వరలో ఓటర్ నమోదుకు ఆధార్ ఫీడింగ్ ప్రక్రియ రానుందని తెలిపారు. మరణించిన వారి డెత్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో పొందుపర్చి వారి పేర్లను తొలగిస్తామని చెప్పారు. ఎక్కడా ఓటరు లిస్టులో పేరులేని వయోజనులు ఓటుహక్కు కోసం తగిన ప్రూఫ్‌పెట్టి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పేర్లు లేని వారి నమోదులో రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎన్నికల డీటీ తాజుద్దీన్, ఇన్‌చార్జి తహహసీల్దార్ శేఖర్, బాలాపూర్, మహేశ్వరం, సరూర్‌నగర్ తహహసీల్దార్లు ఇందిరాదేవి, సైదులు, రాజు, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జయేందర్, బుట్టి బాల్‌రాజ్, అఫ్జల్‌బేగ్, ప్రశాంత్, జి.యాదయ్య, కంద పెద్దనర్సింహ, అమరేందర్, ఆర్‌ఐలు ప్రేమ్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి

యువత చేతుల్లో దేశ భవిష్యత్తు

ఘట్‌కేసర్, మే 3 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) మండల కార్యదర్శి సంపంగి సదాశివ అన్నారు. ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం పోచారం మున్సిపాలిటీ ఆర్జీకే కాలనీలో సమాఖ్య జండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం యువత నిరంతర ఉద్యమాలు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొన్నదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, అనంద్, సోమన్న, చిరంజీవి, పాండు, నాగరాజు, శ్యామ్, భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో తీవ్ర పంటనష్టం

ఆమనగల్లు, మే3(ఆంధ్రజ్యోతి): పగలు ఎండ తీవ్రత, సాయంత్రం వేళ వర్షంతో శనివారం భిన్న వాతావరణం ఏర్పడింది. సాయంత్రం వరకు భానుగు భగ్గుమన్నాడు. సాయంత్రం 4గంటల తర్వాత ఉన్నట్టుండి వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఆమనగల్లులో శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి వరి ధాన్యం కొట్టుకుపోయింది. మార్కెట్ యార్డ్‌లో ఎండబోసినవడ్లు వరదకు హైదరాబాద్-శ్రీశైలం రహదారిపైకి చేరాయి. వడ్లను కాపాడుకోవడానికి రైతులు, మహిళలు ధాన్యాన్ని కుప్ప పోశారు. వారం పది రోజులుగా మార్కెట్‌లోని సీసీపై వడ్ల ఎండబోస్తున్నారు. ఉదయం సుమారు 800బస్తాల ధాన్యం తూకం వేసి మిల్లుకు తరలించడానికి మార్కెట్ ఆవరణలో ఉంచారు. ఒక్కసారిగా వచ్చిన వర్షంతో ఎండబోసిన ధాన్యం తడిసింది. మార్కెట్ యార్డ్ నీటి కుంటను తలపించింది. వేలాది బస్తాల ధాన్యం తడిసింది. సుమారు 100మంది రైతుల ధాన్యం తడిసింది.

ఈదురు గాలులతో వర్షం


కొనాయలపల్లి వద్ద రోడ్డుపై విరిగిన పడిన చెట్లు

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట, కోనాయపల్లి గ్రామ మధ్య శనివారం సాయంత్రం ఈదురు గాలులతో వర్షం పడింది. కొత్తపేట-కోనాయపల్లి రోడ్డులో అక్కడక్కడ చెట్లు విరిగిపడ్డాయి. రాకపోకలకు ఇబ్బందులేర్పడ్డాయి. మామిడికాయలు రాలాయి. కొత్తపేట, సంతాపూర్, చౌలపల్లి, మీనామోనిపల్లి గ్రామాల్లోనూ వర్షం పడింది.

పిడుగుపడి గేదె మృతి



కందుకూరు: మండలంలోని గాజులబురుజు తండాలో శనివారం సాయంత్రం పిడుగుపడి ఓ గేదె మృతిచెందింది. బేగంపేటకు చెందిన రాజు తన గేదెను పొలం వద్ద దొడ్డిలో కట్టేశాడు. ఉరుములు, మెరుపులతో పిడుగు పడి గేదె చనిపోయింది.

వడగండ్లకు రాలిన వడ్లు, మామిడి

కడ్తాల్: అకాల వడగళ్ల వర్షం, ఈదురు గాలులు అన్నదాలతలకు తీవ్ర నష్టం కలిగించింది. కడ్తాల మండలం ఎక్వాయిపల్లి, మర్రిపల్లి గ్రామాల్లో శుక్రవారం రాత్రి వడగండ్ల వర్షానికి కోతకొచ్చిన వరిచేలలో వడ్లు, తోటల్లో మామిడి కాయలు నేలరాయి. అరగంట పాటు వడగండ్ల వాన కురిసింది. వైర్లు తెగి చాలాచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎక్వాయిపల్లి, మర్రిపల్లి గ్రామాల్లో 60 మంది రైతులకు చెందిన 82ఎకరాల వరి పంట, పదెకరాల్లో మామిడి పంటలు దెబ్బతిన్నా యి. రైతులు జోగు వీరయ్య, సుమన్, మల్లేశ్, బిక్షపతి, రాఘవరెడ్డి, మహేశ్, చంద్రయ్య, శ్రీశైలం, కొమురయ్య, బాలయ్య, జంగయ్యల వరిపంటకు భారీ నష్టం వాటిల్లింది. నేలరాలిన పంటను శనివారం ఏవో శ్రీలత పరిశీలించారు. ఏఈవోలు అభినవ్‌రెడ్డి, కష్యప్‌లతో పంట నష్టం వివరాలను నమోదు చేశారు.

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం..

వడగండ్ల వానతో పంటలు కోల్పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, ఎవరూ అధైర్యపడొద్దని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పంట నష్టంపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వివరిస్తానని చెప్పారు. ఎక్వాయిపల్లి, మర్రిపల్లిల్లో పంటలను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. నష్టపోయిన రైతులకు ప్రభు త్వం నుంచి నష్టపరిహారం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ఎమ్మె ల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నర్సింహ, వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యు డు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఉమవతి, ప్యాక్స్ డైరెక్టర్ జె.వీరయ్య, నాయకులు పి.కరుణాకర్ గౌడ్, సుమన్, మల్లేశ్, శంకర్, బిచ్యానాయక్, బిక్య, శేఖర్‌గౌడ్, రవి, ఇమ్రాన్‌బాబ, రైతులు ఉన్నారు.

పగలు ఎండ సాయంత్రం వాన!


ఆమనగల్లు యార్డులో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళా రైతు

నమోదైన ఉష్ణోగ్రతలు(సెల్సియస్)

మండలం	ప్రాంతం	నమోదు
శంకర్‌పల్లి	పొద్దుటూరు	42.6
మొయినాబాద్	మొయినాబాద్	42.4
మొయినాబాద్	రెడ్డిపల్లి	41.7
మహేశ్వరం	మహేశ్వరం	41.6
హయత్‌నగర్	వనస్థలిపురం	41.5

వర్షపాత వివరాలు(మిల్లీ మీటర్లలో..)

మండలం	ప్రాంతం	నమోదు
ఆమనగల్లు	ఆమనగల్లు	27.5
తలకొండపల్లి	వెల్జాల్	16.0
కందుకూరు	రాచులూర్	11.8
తలకొండపల్లి	చుక్కాపూర్	11.5
అబ్దుల్లాపూర్‌మెట్	పసుమాముల	11.5


కడ్తాల్: ఎక్వాయిపల్లిలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఎకరాకు రూ.40వేల పరిహారమివ్వాలి

వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఎక్వాయిపల్లి, మర్రిపల్లి, ముద్విన్ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను నాయకులతో కలిసి పరిశీలించారు. మండలంలో 200 ఎకరాల్లో పంటనష్టం జరిగిందని తెలిపారు. అధికారులు వెంటనే గ్రామాల్లో పంటనష్ట వివరాలను ప్రభుత్వానికి నివేదించాలన్నారు. రైతులకు ఎకరాకు రూ.40వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జోగు వీరయ్య, నర్సింహగౌడ్, బిక్షపతి, నర్సిం హ, యాదయ్య, బాలయ్య, కృష్ణయ్య, జంగయ్య, సురే శ్ ఉన్నారు. అలాగే పంటలను డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, గంప శ్రీను పరిశీలించారు.


ఎక్వాయిపల్లిలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి


కుర్మిద్దలో వడగండ్లతో రాలిన వడ్లు

రాలిన మామిడి

యాచారం: మండలంలోని నజ్దిక్‌సింగారం, కుర్మిద్ద, యాచారం, నజ్దిక్‌సింగారం తదితర గ్రామాల్లో వడగండ్ల వర్షంతో వడ్లు, మామిడికాయలు రాలాయి. అధికారులు పొలాలను పరిశీలించి తమకు తగిన పరిహారం అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

పంటను పరిశీలించిన అధికారులు

కందుకూరు: వనగండ్ల వర్షంతో దెబ్బతిన్న పంటలను శనివారం ఏఈవో నర్మద లేమూరులో పరిశీలించారు. శుక్రవారం రాత్రి లేమూరు, గూడూరు, రాచులూరుల్లో వనగండ్ల వాన కురిసింది. లేమూరులో వరి పంటకు తీవ్రనష్టం వాటిల్లింది. ఏఈవో, కాంగ్రెస్ నాయకులు కె.రాణాప్రతాప్‌రెడ్డి, శ్రీధర్ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు కేశవరెడ్డి, రహీం, మధుసూదన్‌రెడ్డి, ఎం.షైనయ్య, యాదవరెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, రవి, నాయకులు విఠల్‌రెడ్డి, ఎం.రవి, కరుణాకర్‌రెడ్డి ఉన్నారు. శనివారం సాయంత్రం కందుకూరు, కొత్తగూడ, నేదునూరు, దెబ్బడగూడ, గూడూరు, దాసర్లపల్లి గ్రామాల్లో వర్షం కురిసింది.


కందుకూరు: లేమూరులో వరి పంటను పరిశీలిస్తున్న ఏఈవో నర్మద, కాంగ్రెస్ నాయకులు

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- హైదరాబాద్-శ్రీశైలం హైవేపై రైతుల రాస్తారోకో


మార్కెట్ యార్డ్ ఎదుట బైఠాయించిన రైతులు

ఆమనగల్లు, మే 3(ఆంధ్రజ్యోతి):ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో శనివారం వర్షానికి వడ్లు తడిసిపోవడంతో రైతులు ఆగ్రహించారు. కొనుగోళ్లలో జాప్యంవల్లే ధాన్యం తడిశాయని ఆవేదనతో మార్కెట్ యార్డ్ వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపైకి రాస్తారోకో చేశారు. గంట పాటు వాహనాలు నిలిచాయి. తమకు న్యాయం చేయాలని రైతులు భీష్మించారు. రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ధర్నాలో పాల్గొన్నారు. తడిసిన వడ్లను ప్రభుత్వం కొనాలని, కలెక్టర్ వచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులను ఇబ్బందులు పెడుతోందని ఆరోపించారు. సమాచారం అందుకున్న సీఐ జానకిరాంరెడ్డి, సిబ్బందితో యార్డ్ వద్దకు చేరుకొని రైతులకు, బీఆర్ఎస్ నాయకులకు నచ్చజెప్పి యార్డ్‌లోకి తీసుకెళ్లారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించకుండా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోవాలని సూచించారు. ఏఎంసీ చైర్‌పర్సన్‌తో మాట్లాడి కొనుగోళ్లలో జాప్యం లేకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. కార్యక్రమంలో పత్యానాయక్, రమేశ్‌నాయక్, వెంకటేశ్, శివకుమార్, గణేశ్,శివ, యాదయ్య, గణేశ్‌నాయక్, రాజు, ధర్మ, సోమ్లా, వస్య, బుజ్జి, శారద, సిరోలి, మారోని, యాదమ్మ, జంగయ్య, రాములు, తానయ్య, నరేశ్, రమేశ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మాల్ పంచాయతీ అధికారులు



రంగారెడ్డి అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): యాచారం మండలం మాల్ పంచాయతీకి జాతీయ పంచాయతీ అవార్డు రావడంతో అధికారులు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను శనివారం కలెక్టరేట్‌లో కలిశారు. మొక్కను బహుకరించి జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్‌తో పాటు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

దుద్యాల మండల వాసికి అవార్డు


అవార్డును అందుకుంటున్న ఉషశ్రీ,శ్యామ్


దుద్యాల, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన ఉషశ్రీ-శ్యామ్‌రాథోడ్ దంపతులు హైదరాబాద్‌లో రాథోడ్స్ ఐఏఎస్ అకాడమీని నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 30న ఢిల్లీలో ఆసియా టుడే నిర్వహించిన వరల్డ్ ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో ఇన్‌స్టిట్యూట్ ఇన్ హైదరాబాద్ అవార్డును దంపతులు కేంద్ర మంత్రి రాజ్‌భూషన్‌చౌదరి, ఢిల్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్‌సింగ్‌బిస్ట్‌ల నుంచి అందుకున్నారు. కృషి, అంకితభావం, విద్యారంగంలో చేసిన సేవలకు గౌరవం దక్కిందని శ్యామ్ సోదరులు సీతారాంనాయక్, అంతునాయక్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు వారిని అభినందించారు.

ధాన్యం సేకరణకు చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం సేకరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. శనివారం పౌరసరఫరాల అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 129 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణకు సదుపాయాలు కల్పించాలన్నారు. వర్షాలొస్తే వడ్లు తడవకుండా టార్పాలిన్లు, గోనె సంచులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కొన్న ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు చేరవేయాలన్నారు. రవాణాకు వాహనాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్‌బాబు, జిల్లా మేనేజర్ మోహన్‌కృష్ణ, మార్కెటింగ్ ఏడీ సారంగపాణి, వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి, సహకార అధికారి నాగార్జున, డీసీఎంఎస్ అధికారి శ్యామ్ సుందర్‌రెడ్డి, పలువురు రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం, మే 3(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదలకు వరం వంటిదని, దీనితో ఏంతో మేలు జరుగుతోందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం తుక్కుగూడలోని కాంగ్రెస్‌కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. నిరుపేద కుంబాల వారు అనారోగ్యంతో అప్పుల పాలవుతున్నారని, ఆస్పత్రి ఖర్చులకు సీఎం సహాయనిధి ఉపయోగపడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఓర్వలేని బీఆర్ఎస్, బీజేపీల నాయకులు ప్రభుత్వంపై పసలేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ జంగయ్య, సత్యం, సమత తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలకు రూ.8.51లక్షల ఫైన్


మైన్స్ ఏడీ సత్యనారాయణ

తాండూరురూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఓగీపూర్‌లో నాపరాతి అక్రమ తవ్వకాలపై మైన్స్ అధికారులు భారీ జరిమానా విధించారు. ఓగీపూర్‌లోని సర్వే నంబర్-45 పట్టా భూమిలో 2021లో అనుమతి లేకుండా ఫిరోజ్ అహ్మద్ అనే వ్యక్తి పట్టా భూమిలో తవ్వకాలు జరిపారు. అప్పట్లో ఆయనపై మైన్స్ శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. మైన్స్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయనకు రూ.8,51,200 జరిమానా విధించినట్లు తాండూరు మైన్స్ ఏడీ సత్యనారాయణ వెల్లడించారు. అక్రమ తవ్వకాలు జరిపే వారిపై చర్యలు తప్పవని ఏడీ హెచ్చరించారు. అలాగే తాండూరు మైన్స్ పరిధిలోని నవాబుపేట మండలం మేనేపల్లి కలాన్, కొడంగల్ మండలం పెద్దనందిగామ, గోవిందరావుపూర్, పూడూరు మండలం మంచన్‌పల్లి ఖనిజ సైడ్‌ట్‌లలో దరఖాస్తులకు చివరి తేదీ ఈ నెల 9వ వరకు పొడిగించామని ఏడీ వెల్లడించారు.

అర్హులందరికీ రుణాలందిస్తాం

యాచారం, మే3(ఆంధ్రజ్యోతి): యువతీ యువకులకు రుణాలందించి ఆదుకుంటామని, స్వయం ఉపాధి పొందేవారందరికీ రాజీవ్ యువవికాసం పథకం కింద ఆర్థిక సాయమందిస్తామని ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిషత్‌లో బ్యాంకర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. యూనిట్ పెట్టుకుంటేనే రుణ సాయమందుతుందన్నారు.

నగా దారిలో..

5వ పేజీ తరువాయి..

ఆంగ్ల పాఠాలు బోధిస్తున్నారు. అయినా తెలుగు భాష అంటే ఆయనకు ప్రత్యేక అభిమానం. తెలుగులో ఇప్పటి వరకు వందలాది కవితలు రాశారు. పద్యాలు, గజల్స్ కూడా రచించారు. దిన, వార, మాస పత్రికల్లో ప్రచురితమై రాష్ట్రస్థాయి కవితా సంకలనాల్లు చోటు సంపాదించి ప్రముఖ కవులు, సాహితీవేత్తల ప్రశంసలు అందుకున్నారు. పద్యమే తెలుగు భాషకు ప్రాణమని నమ్మిన నరేందర్‌రెడ్డి చందస్సు నేర్చుకుని పద్య రచన చేశారు. ఇప్పటి వరకు శ్రీ అయ్యప్పస్వామి శతకం, అమృత వర్షిణి శతకం,శ్రీ లక్ష్మీనరసింహస్వామి శతకం, గీతామృత శతకం, వేంకటేశ్వరశతకం, వేంకటేశ్వర గజల్స్ రచించి ముద్రించారు. సాహిత్యంలో క్లిష్టమైన ప్రక్రియగా నిలిచిన గజల్‌ను ఇష్టమైన ప్రక్రియగా స్వీకరించి ఉన్నత స్థానానికి ఎదిగిన ఈ కవి ఎందరో అభిమానాలను సంపాదించుకున్నారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో తనప్రతిభను చాటుకున్నారు.

సినిమా రంగంలో సత్తా చాటి

ప్రముఖ గజల్ గాయని డాక్టర్ స్వరూపరెడ్డి ద్వారా నరేందర్‌రెడ్డి సినిమా ఇండస్ట్రీకి పరిచమ య్యారు. విరాటపర్వం సినిమా దర్శకులు వేణు ఊడుగుల, సంగీత దర్శకుడు సురేశ్ బొబ్బిలితో పరిచయం ఉండట ంతో వారు నరేందర్‌రెడ్డికి పా టలు, గజల్స్ రాసే అవకాశం ఇచ్చారు. ఆయన తనకు వచ్చి న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విరాటపర్వం సినిమాకు మూడు పా టలు రాశారు. అదే సినిమాలో ఒక గజల్, రెం డు పద్యాలు కూడా రాశారు. ఈ సినిమాలోని నగదారిలో పాట ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇండస్ట్రీ అంతా ఎవరా నరేందర్‌రెడ్డి అని ఆయ న గురించి ఆరా తీసిన సందర్భాలున్నాయి.

హర్షం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు

చిత్ర పరిశ్రమకు పరిచయమై తన పేరును సుస్థిరం చేసుకున్న ద్యావరి నరేందర్‌రెడ్డిని పెద్దేముల్ మండల ప్రజలు అభినందిస్తున్నారు. ఇంకా చాలా సినిమాల్లో పాటలు రాసి తనకు, మండలానికి మంచి పేరును తీసుకురావాలని కోరుతున్నారు. విరాటపర్వం సినిమాలోని నగా దారిలో అనే పాట మహా అద్భుతమని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ కొనియాడారు. ఈ విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల వారు మంబాపూర్‌లో నరేందర్‌రెడ్డిని సన్మానించారు. సినిమా రంగంలోనూ తాండూరు ప్రాంతానికి మంచిపేరును సంపాదించారని స్థానికులు కొనియాడుతున్నారు. భవిష్యత్తులో మరిన్ని పాటలు, కవితలు రాయాలని కోరారు.

ఎండిన చెరువుల లీజ్‌లు రద్దు చేయాలి


తాండూరులో మత్స్యకారుల సమావేశంలో పాల్గొన్న నరసింహ

తాండూరు, మే 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండిన చెరువులు, కుంటల లీజ్‌లు రద్దుచేయాలని టీఎంకేఎంకేఎస్ అధ్యక్షులు గొరైంకల నరసింహ డిమాండ్ చేశారు. శనివారం తాండూరులోని పీపుల్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నియోజకవర్గ మత్స్య కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్యకారులను పట్టించుకోకుంటే కాంగ్రెస్ పార్టీకి ముదిరాజ్‌లు దూరమవుతారని హెచ్చరించారు. గత సంవత్సరం నుంచి ఇప్పటి వరకు చెరువుల్లో చేప పిల్లలు వదల్లేదని, మత్స్యకారులకు నగదును బ్యాంక్ అకౌంట్లలో జమచేయలని డిమాండ్ చేశారు. ఈ నెల 15న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద మహాధర్నాను నిర్వహిస్తామని ప్రకటించారు. గీత కార్మికుల మాదిరిగానే 50ఏండ్లు నిండిన మత్స్యకారులకూ పింఛన్ ఇవ్వాలని, చనిపోయిన మత్స్యకారుల కుటుంబానికి రూ.10లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తీర్మానించారు. అనంతరం తాండూరు గొల్ల చెరువును సందర్శించి శిఖం కబ్జా చేస్తోంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని, అక్రమ నిర్మాణాలు తొలగించాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామాల మత్స్య కార్మికులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ పల్లకీ సేవ

షాద్‌నగర్ అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చౌడమ్మగుట్ట అంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ పల్లకిసేవను నిర్వహించారు. మాజీ సర్పంచ్ పి.శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పల్లకిసేవను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు జి. వసంత్‌రావు, అన్నారం రాఘుగౌడ్, మంచిరేవుల ఆశోక్, గడ్డమీది రమేష్, లక్ష్మీకాంత్‌రెడ్డి, శంకర్ గౌడ్, కిషన్‌నాయక్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.


హనుమాన్ పల్లకీసేవలో భక్తులు

రహదారుణం!

5వ పేజీ తరువాయి..

తప్పడం లేదు. షాద్‌నగర్ నియోజకవర్గంలో 32కిలో మీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్లు దెబ్బతినగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 40 కిలోమీటర్లు దెబ్బతిన్నాయి. హైబ్రిడ్ యాన్యుటిటీ మోడ్(హ్యామ్) పద్ధతిలో రోడ్ల అభివృద్ధికి షాద్‌నగర్ నియోజకవర్గంలో లాల్‌పహాడ్ వరకు 23కిలోమీటర్లు రోడ్డు వెడల్పు, మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 30కిలోమీటర్ల మేర ఏడు రోడ్లకు రూ.6కోట్లు మంజూరు చేశారు. టెండర్ ప్రక్రియలో తీవ్ర కాలయాపన జరుగుతోంది. జిల్లాలో రోడ్ల నిర్మాణాలు, మరమ్మతు పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి.

అసంపూర్తిగా రోడ్డు పనులు

మీర్‌ఖాన్‌పేట్ నుంచి యాచారం వరకు రూ.78కోట్లతో వేసే రోడ్డు పనులు మూడున్నరేళ్లుగా అసంపూర్తిగా ఉంది. కాంట్రాక్టర్‌కి రూ.20 కోట్ల బిల్లులు రాక పనులు నిలిపివేశారు. కొత్తపల్లి నుంచి కొత్తపల్లి తండా వరకు రూ.3కోట్లతో నిర్మించాల్సిన రోడ్డు అసంపూర్తిగా ఉంది. షాద్‌నగర్-కేశంపేట బైపాస్ రోడ్డు నుంచి ఉప్పలపల్లి వరకు 16కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు మరమ్మతులు చేశారు. కమ్మదనం-షాద్‌నగర్ మధ్యలో కొంత పనులు జరగాల్సి ఉంది. వర్షాలు కురిస్తే అయ్యవారిపల్లి వాగు దాటేందుకు వీలు కావడం లేదు. అక్కడ నిర్మిస్తున్న వంతెన పనులకు బిల్లులు ఇవ్వక పోవడంతో పనులు నిలిచిపోయాయి.

దెబ్బతిన్న రోడ్లు ఇవే..

షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో కొందుర్గు-ఉమ్మెంతాల వరకు 6 కిలోమీటర్ల వరకు ఆర్‌అండ్‌బీ రోడ్లు దెబ్బతిన్నాయి. అలాగే అయ్యవారిపల్లి నుంచి ఆగరాల నుంచి 3కిలోమీటర్లు, లాల్‌పహాడ్ నుంచి చలివేంద్రపల్లి 5 కిలోమీటర్లు, చేగిరెడ్డిఘనాపూర్‌లో నుంచి గాలిగూడ వరకు 6కిలో మీటర్లు, చౌదరిగూడ జీపీ రోడ్డు నుంచి కొంపల్లి రోడ్డు, ఇంద్రనగర్ గుర్రంపల్లి 4కిలోమీటర్లు, జాకారం, దేవలతండా 2కిలో మీటర్లు, రేగడి రామచంద్రాపురం నుంచి రేగడి చల్కమర్రి 5కిలోమీటర్లు, తుంపల్లి వరకు రోడ్లు దెబ్బతిన్నాయి. ఉమ్మెంతాల, రేగడి చల్కమర్రి తక్షణం మరమ్మతులు చేయాల్సి ఉంది. షాబాద్ మండలం నాగర్‌గూడ నుంచి శంషాబాద్ వరకు 35కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.220కోట్లతో చేపట్టేందుకు పారిశ్రామికవాడ నిధులతో పనులు ప్రారంభించారు. అయితే పనులు మూడేళ్ల నుంచి సాగుతున్నాయి. చేవెళ్ల నుంచి వెంకటాపూర్ వరకు 12కిలోమీటర్లు, వెంకటాపూర్ నుంచి కనకమామిడి, చిలుకూర్, నక్కపల్లి, చందానగర్, తొల్‌కట్ట, తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి.

ప్రతిపాదనలకే పరిమితం

చేవెళ్ల మండలంలో 41 కిలోమీటర్ల దూరం, శంకర్‌పల్లి మండలంలో 38 కిలోమీటర్ల దూరం వరకు పంచాయతీరాజ్ శాఖ రోడ్ల మరమ్మతుల కోసం ప్రభుత్వానికి అధికారులు ఇటీవలే ప్రతిపాదనలు పంపారు. అలాగే షాబాద్ మండలంలోని అంతారం నుంచి అప్పారెడ్డిగూడ వరకు 8కిలో మీటర్ల రోడ్డు గుంతలమయంగా మారింది. నాగర్‌గూడ-శేగడిదోస్వాడ 6 కిలోమీటర్ల రోడ్డు గుంతలమయమైంది. దీనికి అదనంగా మరో 25 కిలోమీటర్ల రోడ్లు బాగుచేయాలని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. మొయినాబాద్ మండలంలో 28కిలోమీటర్ల వరకు రోడ్ల మరమ్మతుల కోసం అధికారులు ప్రతిపాదించారు. పంచాయతీరాజ్ రోడ్లకు సంబంధించి ఎఫ్‌డీఆర్ కింద చౌలపల్లి నుంచి ఉడిత్యాల వరకు 4కిలోమీటర్లు, పరిగి రోడ్డు నుంచి రామేశ్వరం వరకు వయా కిషన్‌నగర్ మీదుగా 8కిలోమీటర్లు, షాద్‌నగర్-మొదుళ్లగూడ, బూర్గల-మధురాపూర్ వరకు, ఎన్‌హెచ్ 44నుంచి శంకరయ్యగడ్డ తండా వరకు, పరిగి రోడ్డు నుంచి బాపనిగుట్ట తండా వరకు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపగా రూ.9.96కోట్లు మంజూరయ్యాయి. ఇంకా రోడ్డు నిర్మాణాలు చేపట్టలేరు. అలాగే మెంటనెన్స్ కింద షాద్‌నగర్ నుంచి ఈదులపల్లి వరకు మధురాపూర్-శేరిగూడ వరకు, పరిగి రోడ్డు నుంచి పీర్లగూడ వరకు రోడ్డు నిర్మించేందుకు మెంటెనెన్స్ కింద ప్రతిపాదనలు పంపారు.


కంకర తేలిన కడ్తాల్ రోడ్డు

టెండర్ దశలోనే పనులు

2023 డిసెంబరు నుంచి ఇప్పటి వరకు జిల్లాలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎంఆర్‌ఆర్ కింద 51కిలో మీటర్లకు రూ.15.07కోట్లు మంజూరయ్యాయి. ఇవి టెండర్ దశలో ఉన్నాయి. సీఆర్‌ఆర్ కింద రూ.30కోట్లు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. షాద్‌నగర్ నుంచి కిషన్‌నగర్ వరకు రోడ్డు విస్తరణకు, కిషన్‌నగర్-అయ్యవారిపల్లి వరకు రోడ్డు విస్తరణ కోసం ప్రతిపాదనలు పంపించారు. లాల్‌పహాడ్ నుంచి చలివేంద్రపల్లి, నుంచి జాకారం, జిల్లేడు వరకు రోడ్డు వరకు కొత్త రోడ్డు పనులు చేపట్టారు. వీరన్నపేట నుంచి గాలిగూడ వరకు పూర్తి చేశారు.

ఇబ్బందికరంగా ప్రయాణం..

వికారాబాద్ జిల్లాలో ఆర్‌అండ్‌బీ రోడ్లు కొంతకాలంగా నిర్వహణ, మరమ్మతులకు నోచుకోక కొన్ని మార్గాల్లో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. జిల్లా వ్యాప్తంగా 285కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి. తక్షణం మరమ్మతులు చేపట్టాల్సిన రోడ్లు 160కిలోమీటర్లు ఉన్నాయి. వానలు, వరదల ప్రభావంతో జిల్లాలో 135కిలోమీటర్ల వరకు దెబ్బతిన్నాయి. 2023, డిసెంబరు నుంచి ఇప్పటి వరకు జిల్లా పరిధిలో రూ.1,854.43కోట్లతో 38పనులు మంజూరయ్యాయి. ఈ పనుల్లో 21పనులు ప్రారంభం కాగా, 17పనులు అగ్రిమెంట్ స్థాయిలో ఉన్నాయి. రోడ్ల నిర్మాణంలో కొడంగల్ నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ నియోజకవర్గంలో రూ.1,100కోట్లతో రోడ్ల పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వీటిలో కొన్ని పనులు ప్రారంభం కాగా, మరికొన్ని టెండర్ దశలో ఉన్నాయి. ఇవే కాకుండా ఎస్టీ ఎల్‌డీఎఫ్ కింద ఐదు పనులు మంజూరు కాగా, కొడంగల్ పరిధిలో రూ.27.87కోట్లతో మూడు రోడ్లు, తాండూరులో రూ.5కోట్లు, పరిగిలో రూ.6కోట్లతో చేపట్టిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. నాన్‌ప్లానింగ్ కింద రూ.5.50 కోట్లతో 3పనులు, సీఆర్‌ఎఫ్ కింద 2 పనులకు రూ.60కోట్లు మంజూరయ్యాయి. హ్యామ్ విధానంలో రోడ్ల అభివృద్ధికి జిల్లా పరిధిలో రూ.9కోట్ల అంచనా వ్యయంతో 45కిలోమీటర్లు గుర్తించారు. రోడ్ల పనులకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఒక్కొక్కరికీ రూ.15నుంచి రూ.20కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో వారు ఆసక్తి చూపడం లేదంటున్నారు.


పనులు చేసేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు

వికారాబాద్ జిల్లాలో 2886.80 కిలోమీటర్ల మేర పంచాయతీరాజ్ రోడ్లు ఉన్నాయి. ఇందులో 480 కిలోమీటర్ల పొడవున రోడ్లు దెబ్బతినగా, వాటిలో 325 కిలోమీటర్ల మేర వెంటనే మరమ్మతులు చేపట్టాల్సిన పరిస్థితి ఉంది.. కాగా, గత ఏడాది కురిసిన వానలు, వరదల ప్రభావంతో జిల్లాలో 285 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. 75 రోడ్ల మరమ్మతులకు రూ.37.15 కోట్లు మంజూరైనా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఈ పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది. 2023, డిసెంబరు నుంచి ఇప్పటి వరకు జిల్లా పరిధిలో రూ.117.82 కోట్లతో 57 రోడ్ల మరమ్మతులు, విస్తరణ పనులు చేపట్టేందుకు టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది. హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్ (హ్యామ్) పద్ధతిలో రోడ్ల అభివృద్ధికి జిల్లా పరిధిలో 398.86 కిలో మీటర్ల పరిధిలో 181 పనులు కిలోమీటర్లు గుర్తించారు.


తారు లేచిపోయి గుంతలమయంగా మారిన మేడ్చల్ మండలం పోతారం-అనంతారం రోడ్డు


పూర్తిగా గుంతలుపడిన మోత్కుపల్లి-వికారాబాద్ రోడ్డు

రైతుల సంక్షేమానికే 'భూభారతి'


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలే యాదయ్య

నవాబుపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమాభివృద్ధికే కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం నిర్వహించిన భూభారతి చట్టంపై అవగాహన సదస్సుకు ఆయన హాజరయ్యారు. భూవివాదాల పరిష్కారానికి భూభారతి చట్టం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. జూన్ మొదటి వారం నుంచి నూతన చట్టం భూభారతి సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం బలోపేతమే ప్రభుత్వ ధ్యేయం

విద్యారంగం బలోపేతమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నూతన అడ్మిషన్లను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే సమక్షంలో అత్తాపూర్ గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి కుమారుడు కళాశాలలో అడ్మిషన్ పొందాడు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేశ్వర స్వామి, అధ్యాపకులు వెంకటయ్య, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి టాపర్లకు ఘన సన్మానం


పదోతరగతి టాపర్ల సన్మానంలో అధికారులు

బషీరాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన మండల టాపర్లకు బషీరాబాద్ మండల పరిషత్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల(బాలికలు) పి.భావన, సాలేహ ప్రథమ, ద్వితీయ మండల టాపర్లతో పాటు తృతీయ టాపర్‌గా నిలిచిన కేజీబీవీ విద్యార్థిని యూ.నవనీతను శాలువ, పూలమాలలతో ఎంపీడీవో విజయ్‌కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వై.వెంకటేశ్, విద్యాధికారి దూస రాములు, ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ విజయకుమారి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి

మర్పల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి సాధ్యమవుతోందని కాంగ్రెస్ నాయకులు రాములుయాదవ్ అన్నారు. మండల కేంద్రంలో రూ.18కోట్లతో డివైడర్ రోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగేశ్, గణేశ్, సలీమ్, నర్సింహులుయాదవ్, వెంకటేశం, ప్రభాకర్‌రెడ్డి, జాఫర్, ఖయ్యూం, కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

భక్తులకు ప్రత్యేక బస్సు సౌకర్యం

కీసర, మే 3 (ఆంధ్రజ్యోతి): అనతి కాలంలోనే ఎంతో అభివృద్ధి చెందిన చీర్యాల్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాగూర్ అన్నారు. ఈమేరకు సికింద్రాబాద్ నుంచి ఆలయం వరకు నడిచే బస్సును శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనంతరం ఆలయ మహామండపంలో ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ ఆయనకు స్వామివారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

మూడుచింతలపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): జగ్గంగూడ సంపన్ బోల్‌లో రోడ్డు సమస్యలను పరిష్కరించాలని శనివారం ఎంపీ ఈటల రాజేందర్‌కు జగ్గంగూడ మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో పల్లెదవాఖానా, ప్రైమరీ స్కూల్‌కు వెళ్లేందుకు సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పైలెట్ ప్రాజెక్టుకు ధారూరు ఎంపిక

ధారూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): భూభారతి పైలెట్ ప్రాజెక్టు కింద ధారూరు మండలాన్ని కలెక్టర్ ఎంపిక చేశారని తహసీల్దార్ సాజిదాబేగం తెలిపారు. ఇందులో భాగంగా వికారాబాద్ ఆర్డీవో నోడల్ అధికారిగా ఈ నెల 5న మండలంలోని అవుసుపల్లి, బాచారం గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు భూభారతి రెవెన్యూ సదస్సులు కొనసాగుతాయని ఆమె చెప్పారు. జిల్లాస్థాయి అధికారులు పాల్గొని రైతుల భూసమస్యలు పరిష్కరిస్తారని ఆమె తెలిపారు.

6న 'అనురాగ్' ప్రవేశపరీక్షలు

ఘట్‌కేసర్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్, అగ్రికల్చరల్, నర్సింగ్ కోర్సుల్లో చేరడానికి ప్రవేశ పరీక్షలు ఈనెల 6న నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ మహిపతి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ పరీక్షను అనురాగ్ యూనివర్సిటీలో ఉదయం 11గంటలకు నిర్వహిస్తామని చెప్పారు. ప్రవేశ పరీక్షల్లో అర్హత పొంది మే 11న స్కాలర్‌షిప్ పరీక్షల్లో పొందిన ర్యాంక్‌ల ఆధారంగా విద్యార్థులకు వందశాతం స్కాలర్‌షిప్‌లో రాయితీ ఉంటుందన్నారు.

రమణీయం.. రథోత్సవం



వికారాబాద్ మండల పరిధిలోని సంగమేశ్వర స్వామి జాతరలో భాగంగా శుక్రవారం రాత్రి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు మదన్‌పల్లి నుంచి సంగయ్యలొంక లోని సంగమేశ్వర స్వామి ఆలయం వరకు రథోత్సవం నిర్వహించారు. విద్యుత్ కాంతుల మధ్య రథోత్సవాన్ని ముందుకు తీసుకెళ్లగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

- వికారాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి)

వడదెబ్బ నివారణకు చర్యలు తీసుకోవాలి

మేడ్చల్ ప్రతినిధి, మే 3(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తప్పనిసరిగా నివారణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్ శనివారం ఓ ప్రకటనలో సూచించారు. మధ్యాహ్న సమయంలో వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలని, బయటకు వెళ్లాల్సి వస్తే తలకు టోపీ ధరించడం, తువ్వాలు చుట్టుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాధారణ సమయాల కంటే వేసవిలో ఎక్కువ మోతాదులో ద్రవ పదార్థాలు తీసుకోవాలని, తేలికపాటి కాటన్ వస్త్రాలను ధరించడం వంటివి చేయాలన్నారు. వృద్ధులు, చిన్నారుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ కేంద్రాలకు ఏఎన్ఎం, ఆశ వర్కర్లతో పంపిణీ చేయించాలన్నారు. మూగజీవాలకు, పక్షులకు మంచి నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

'పది'లో తడబాటు!

(ఐదో పేజీ తరువాయి)

కాగా, వారిలో 1,474 మంది ఫెయిల్ అయ్యారు. ఇంగ్లీష్‌లో 12,259 మంది ఉత్తీర్ణులు కాగా, 587 మంది ఫెయిల్ అయ్యారు. తెలుగు/ఉర్దూలో 12,548 మంది ఉత్తీర్ణత సాధించగా, 298 మంది ఫెయిల్ అయ్యారు. సోషల్ స్టడీస్‌లో 12,644 మంది ఉత్తీర్ణులు కాగా, 202 మంది ఫెయిల్ అయ్యారు. హిందీలో 12,760 మంది ఉత్తీర్ణత సాధించగా, 86 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు.

విద్యార్థుల చదువులపై పట్టింపేదీ?!

పదో తరగతి విద్యార్థుల చదువులపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. 2023, 2024 ఫలితాల్లో వరుసగా రెండుసార్లు రాష్ట్రంలో చివరి స్థానంలో నిలిచినా అధికారులు కనీస శ్రద్ధ కనబరచకపోవడంతో 2025లోనూ మూడోసారి రాష్ట్రంలో చివరి స్థానంలో నిలవాల్సి వచ్చిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది జరిగిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులతో విద్యార్థుల చదువులకు విఘాతం కలిగింది. కీలకమైన సమయంలో ప్రధాన సబ్జెక్టుల బోధన సక్రమంగా జరగలేదు. అప్పటి వరకు బోధించిన ఉపాధ్యాయులు ఇతర పాఠశాలలకు వెళ్లడం, కొత్త ఉపాధ్యాయులు రావడంతో విద్యార్థులు త్వరగా ఇమడలేకపోయారు. ఫలితంగా ఫలితాలు ఆశించిన స్థాయిలో సాధించలేకపోయారు. కొన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల చదువులు, ఉపాధ్యాయుల బోధన తీరుపై పర్యవేక్షణ కొనసాగగా, కొన్ని పాఠశాలల్లో మాత్రం ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే విద్యార్థుల చదువులపై ప్రత్యేకంగా దృష్టి సారించి ఉంటే మరింత మెరుగైన ఉత్తీర్ణతతో మెరుగైన స్థానంలో జిల్లా ఉండేదనేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రత్యేక తరగతులతో పెరగనున్న ఉత్తీర్ణత

ఫెయిల్ అయిన విద్యార్థులు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యాశాఖ ప్రత్యేకంగా దృష్టి సారించాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లాలో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిలైన సబ్జెక్టుల్లో విద్యార్థులు జూన్ మూడో తేదీ నుంచి ప్రారంభమయ్యే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఫెయిలైన సబ్జెక్టుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే ప్రయోజనకరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటి నుంచే సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

అకాల వర్షంతో ఆగమాగం


వర్షపు నీటిని తొలగిస్తున్న రైతు

ఘట్‌కేసర్ రూరల్/కీసర రూరల్ మే 3(ఆంధ్రజ్యోతి): అకాలవర్షం అన్నదాతలను అతలాకుతలం చేస్తోంది. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, మదారంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో శుక్రవారం రాత్రి కురిసిన గాలివానకు ధాన్యం తడిసిపోయింది. ధాన్యాన్ని కాపాడకునేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు. ఈదురుగాలులు వీస్తుండటంతో ధాన్యంపై కప్పిన కవర్లు ఎగిరిపోవడంతో కురిసిన వర్షానికి అన్నదాతలు ఉరుకులు, పరుగులు తీశారు. వర్షంలోనే రైతులు అతికష్టం మీద ధాన్యం రాశులపై కవర్లు కప్పారు. శనివారం ఉదయం వచ్చి చూసేసరికి ధాన్యం రాశులపై ఏర్పాటు చేసిన కవర్లపై వర్షం నీరు నిలువడంతో వాటిని తొలగించారు. కొన్నిచోట్ల ధాన్యం తడిసింది.

నాగారం, దమ్మాయిగూడలో..

నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో శనివారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉండి.. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. పెద్ద చినుకులతో ఓ మోస్తరు వర్షం కురిసింది.

ఆంధ్రజ్యోతి విజేతలకు బహుమతులు


కన్సోలేషన్ బహుమతి అందజేస్తున్న చంద్రశేఖర్

మేడ్చల్‌టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి 22వ వార్షికోత్సవం సందర్భంగా కార్ అండ్ బైక్ రేస్ కూపన్ మెగా డ్రాలో గెలుపొందిన విజేతలకు శనివారం ఆంధ్రజ్యోతి సర్క్యులేషన్ సిబ్బంది బహుమతులు అందజేశారు. స్థానిక లోటస్ ఎన్‌క్లేవ్‌లో మోహన్‌రెడ్డి నివాసంలో మేడ్చల్‌కు చెందిన మెరుగు వినోదమోహన్‌రెడ్డి, కొంపల్లికి చెందిన బి.శ్రీహరి, బి.సత్యనారాయణలకు సర్క్యులేషన్ మేడ్చల్ ఏజెంట్ చంద్రశేఖర్ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

బొంరాస్‌పేట్, మే 3 (ఆంధ్రజ్యోతి): కొత్తూర్‌లో ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులు గౌడ్, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని దుప్‌చర్లలో శనివారం వరిధాన్యం మద్దతు ధర కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు.

దేశవ్యాప్త కులగణన నిర్ణయం అభినందనీయం


ఘట్‌కేసర్: మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఘట్‌కేసర్, మే 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాపంగా కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్ అన్నారు. దేశవ్యాప్త కులగణనను స్వాగతిస్తూ శనివారం ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బుద్ధి శ్రీనివాస్, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, కొమ్మిడి శోభ, అచ్చిని నర్సింహ, మహిపాల్‌రెడ్డి, బసరాజ్, మహేందర్ పాల్గొన్నారు.

కీసర రూరల్: కులగణన చేపట్టనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం శుభ పరిణామమని నాగారం మున్సిపల్ మాజీచైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. ఈమేరకు శనివారం నాగారం మున్సిపల్ పరిధి రాంపల్లి చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాగారం మున్సిపాలిటీ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు శ్యామ్, రవీందర్‌రెడ్డి, నరేష్, జంగారెడ్డి, వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోట్‌పల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి పల్లవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతనంగా మండలంలోని కేజీబీవీ పాఠశాలలో బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా విద్యాశాఖ అధికారి మంజూరు చేసినట్లు తెలియజేశారు. వివరాలకు 8328415565ను సంప్రదించాలని సూచించారు.

నగరేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి


ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): పురాతనమైన నగరేశ్వర ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ఆలయ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన హాజరై ప్రసంగించారు. తాండూరులోని ఆలయాలన్నింటికీ పాలక మండళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత మాట్లాడుతూ.. తాండూరు ప్రాంతం ఆధ్యాత్మికతకు నిలయమన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు స్వప్న, కొట్రిక విజయలక్ష్మి, పటేల్ కిరణ్, సతీష్ కుమార్, ఉజ్వల, అనిల్ కుమార్, అనిల్, దామోదర్ పంతులు, శ్రీనివాస్, వీరేందర్ పాల్గొన్నారు.

ధారూరు మార్కెట్‌లో బీట్లు

ధారూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సాయంత్రం కంది, మొక్కజొన్న, ధాన్యం, పసుపు పంట ఉత్పత్తులకు బీట్లు నిర్వహించారు. బీట్లలో కందులు, మొక్కజొన్న, ధాన్యం, సోనా రకం, పసుపు కొమ్ము, గొండ రకం, కందులు, మొక్కజొన్న, పసుపు క్రయవిక్రయాలు జరిగాయని మార్కెట్ అధికారి సిద్దమ్మ తెలిపారు.

అక్కాపూర్‌లో యక్షగాన ప్రదర్శన

నవాబుపేట: తలారి చంద్రయ్య పంతులు ఆశీస్సులతో మండలంలోని అక్కాపూర్‌లో యక్షగాన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ప్రముఖ కవి తలారి ఆశీర్వాదం తెలిపారు. ఈ నెల 5, 7 తేదీల్లో గ్రామంలో దక్షయజ్ఞం ప్రదర్శించబడుతుందని తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


సుభాష్ (ఫైల్)

మోమిన్‌పేట్, మే 3 (ఆంధ్రజ్యోతి): బొలేరో, బైక్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మోమిన్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని రాళ్లగూడుపల్లికి చెందిన మొల్లని సుభాష్(30) శుక్రవారం రాత్రి బురుగుపల్లి నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా రాళ్లగూడుపల్లి వైపు నుంచి కల్లుసరఫరా చేసుకుంటూ వస్తున్న క్రమంలో బొలేరో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో సుభాష్‌కు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. బైక్ నుజ్జునుజ్జయింది. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి నర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరవింద్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మర్పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చెరువులో పడి మరొకరు..


మృతుడు రాథోడ్ శాంత్‌కుమార్

తాండూరు రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన తాండూరు మండల పరిధిలో చోటుచేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గుండ్లమడుగుతండాకు చెందిన రాథోడ్ శాంత్‌కుమార్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం కందురు ఉందని శాంత్‌కుమార్ పాషాపూర్ గ్రామానికి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చాడు. తిరిగి సాయంత్రం 7గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటికి వెళ్లినా తిరిగిరాలేదు. తెలిసిన వారు, కుటుంబీకులు బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. అయితే శనివారం ఉదయం ఐలన్ చెరువు వద్ద శాంత్‌కుమార్ బైకు కనిపించినట్లు జైరాం చౌహాన్ అనే వ్యక్తి కుటుంబీకులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. కుటుంబీకులు చెరువు వద్దకు వెళ్లి చూడగా, ఐలోని చెరువులో శాంత్ కుమార్ మృతదేహంగా గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


సిరిగిరిపేట రవి

తాండూరురూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. ఈ ఘటన తాండూరు మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎల్మకన్నె గ్రామానికి చెందిన సిరిగిరిపేట్ రవి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గతనెల 13వ తేదీన పనికి వెళ్తున్నానని భార్యతో చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి రవి ఇంటికి తిరిగిరాలేదు. బంధువులు, తెలిసిన వారి వద్ద ఆరాతీసినా ఆచూకీ లభించలేదు. రవి భార్య ఆలస్యంగా కరన్‌కోట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

ఫంక్షన్‌హాల్‌లో అగ్ని ప్రమాదం


ఫంక్షన్‌హాల్‌లో తగులబడుతున్న డెకొరేషన్ సామగ్రి

ఘట్‌కేసర్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఫంక్షన్‌హాల్‌లో విద్యుత్ వైరు తెగిపడి అగ్ని ప్రమాదం సంభవించింది. వివరాల్లోకి వెళ్తే.. ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డులో గల ఎస్ఎం ఫంక్షన్‌హాల్‌లో శనివారం మధ్యాహ్నం విద్యుత్ వైరు తెగిపడి ఫంక్షన్‌హాల్‌లో గల డెకొరేషన్ సామగ్రికి మంటలంటుకున్నాయి. విద్యుత్ అధికారులకు సమాచారం అందించి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. వెంటనే ఫంక్షన్‌హాల్ సిబ్బంది, స్థానికులు రంగంలోకి దిగి నీళ్లుచల్లి మంటలను ఆర్పివేశారు.

బస్టాండ్, రైల్వేస్టేషన్లలో తనిఖీలు

వికారాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు శనివారం బీడీ టీం, డాగ్ స్క్వాడ్ అధికారులు వికారాబాద్ పట్టణంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ప్రజలు భద్రతకు ప్రాధాన్యతనిస్తూ చేపట్టిన ఈ చర్యలో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని పోలీసులు తెలిపారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

మోమిన్‌పేట్, మే 3 (ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎం సహాయనిధి అండగా ఉంటుందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై.మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎనిమిది మంది లబ్ధిదారులకు శనివారం ప్రభుత్వం ద్వారా మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజాజ్ పటేల్, సురేందర్, సిరాజుద్దీన్, మహంత్‌స్వామి, అఫ్సర్, రఘురామ్‌రెడ్డి, ప్రేమ్ పాల్గొన్నారు.

దోమ: ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సీఎం సహాయ నిధి పేదలకు అండగా ఉంటుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని గుండాల్ గ్రామానికి చెందిన కామున్‌పల్లి అంజిలయ్యకు శనివారం పరిగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి చొరవతో మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాంచంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, పెద్ద అంజిలయ్య, మాల అంజిలయ్య, శ్రీను పాల్గొన్నారు.

డ్రా చేయకుండానే ఏటీఎంలో డబ్బులు

- పోలీసుల ద్వారా సంబంధిత వ్యక్తికి అప్పగింత


సంబంధిత వ్యక్తి డబ్బులను అందజేస్తున్న ఎస్ఐ హారిక, బుచ్చిబాబు

మూడుచింతలపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట్ గ్రామానికి చెందిన బుచ్చిబాబు ఏటీఎంలో డ్రా చేయకుండానే లభించిన డబ్బులను ఓ వ్యక్తి పోలీసుల ద్వారా సంబంధిత వ్యక్తికి అప్పగించి మానవతా దృక్పథాన్ని చాటుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. శామీర్‌పేట్ గ్రామానికి చెందిన వల్లపు బుచ్చిబాబు గ్రామంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో డబ్బులు డ్రా చేయడానికి వెళ్లాడు. అప్పటికే ఏటీఎం మిషన్‌లో రూ.10వేలు ఉన్నాయి. వెంటనే వాటిని తీసుకుని శామీర్‌పేట్ పోలీసులకు అప్పగించాడు. విచారణ చేపట్టిన పోలీసులు శామీర్‌పేట్ గ్రామానికి చెందిన నజీర్ అనే వ్యక్తి డబ్బులుగా తెలుసుకుని బాధితుడికి అప్పగించారు. పోలీసులు, బాధితుడు బుచ్చిబాబును అభినందించారు.

విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలి

కొడంగల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణను జయప్రదం చేయాలని దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంసాయిలు పిలుపునిచ్చారు. శనివారం కొడంగల్ మండలంలోని పెద్దనందిగామలో ఆదివారం ఏర్పుమళ్లలో జరిగే అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు

ఘట్‌కేసర్ రూరల్: రైతుముగింట్లో శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని మండల రైతులు విజయవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి ఎంఏ బాసిత్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రేపు (సోమవారం) నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమై 16 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు ఉద్యోగుల సదస్సు

తాండూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్ నగరంలో ఉద్యోగుల సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుకు జిల్లా నుండి తరలి రావాలని తెలంగాణ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగరం బ్లాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం 2గంటలకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు.

సంక్షిప్తంగా..

తాండూరు గాయకుడికి సన్మానం

తాండూరు: 'నీ గానమే నా ప్రాణం' 50వ వేడికలు పూర్తిచేసుకున్న సందర్భంగా అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలో బాబు జగ్జీవన్ రామ్ భవన్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో తాండూరు అయ్యప్ప దేవాలయ ప్రతినిధి, గాయకుడు, ఉపాధ్యాయుడు జైపాల్‌రెడ్డిని సన్మానించారు. తాండూరులో గత అక్టోబర్ నెలలో 'నీ గానమే నా ప్రాణం' అనే కార్యక్రమాన్ని నిర్వహించినందుకు గానూ శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి

పరిగి: పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి అన్నారు. ప్రపంచ పత్రికా దినోత్సవం సందర్భంగా శనివారం పరిగిలో బీజేపీ ఆధ్వర్యంలో జర్నలిస్టులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు ఈశ్వరప్ప పాల్గొన్నారు.

దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలి

తాండూరు: సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వేచరేణి గ్రామానికి చెందిన ఊపిరి అజయ్ కుమార్ అనే దళిత యువకుడిపై దాడి చేసిన ఆర్ఎస్ఎస్, బీజేపీ, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ వ్యక్తులను తక్షణమే అరెస్టు చేయాలని ప్రజా సంఘాల నేతలు తాండూరులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట శనివారం నిరసనకు దిగారు.

అనాథ పిల్లలను ఆదుకోవాలి

శామీర్‌పేట: అనాథ పిల్లలకు సాయమందించి ఆదుకోవాలని దాత తంటం శ్రావణ్ కుమార్ పిలుపునిచ్చారు. అలియాబాద్‌లోని సంఘ సేవకురాలు నీరజ అర్షశోధ సంస్థా ఆశ్రమంలో పిల్లలకు శనివారం అలియాబాద్ గ్రామానికి చెందిన దాతలు తంటం శ్రావణ్‌కుమార్, తంటం విజయలక్ష్మి, తంటం మీనాక్షిలు బియ్యం, మంచి నూనె, కూరగాయలు, బిస్కెట్లు, వంట సామగ్రి సరుకులను అందజేశారు.

సామాజిక సేవలను వినియోగించుకోవాలి

తాండూరు రూరల్: అంతారంలో ఎల్ఎన్ఆర్ యువసేనా ఆధ్వర్యంలో నిర్వహించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎల్ఎన్ఆర్ యువసేనా అధ్యక్షుడు లొంక నర్సింహులు అన్నారు. ఎల్ఎన్ఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం తాండూరు మండలం అంతారంలో ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి గ్రామస్తులకు రూ.51వేల విరాళాన్ని అందజేశారు. అనంతరం గ్రామ శివారులోని ఎల్ఎన్ఆర్ ఇంట్లో జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.

5న ఆర్టీసీ కార్మికుల కవాతు

శామీర్‌పేట: ఈనెల 5వ తేదీన నగరంలోని ఆర్టీసీ కళాభవన్ నుంచి బస్‌భవన్ వరకు పెద్దఎత్తున ఆర్టీసీ కార్మికుల కవాతు ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మజ్దూర్ యూనియన్ హకీంపేట డిపో కార్యదర్శి గోపు శ్రీనివాస్ తెలిపారు.

ఆస్తి పన్ను చెల్లింపు గడువు పొడిగింపు

శామీర్‌పేట: ఐదు శాతం తగ్గింపుతో ఆస్తి పన్నును చెల్లించేందుకు గడువు ఈనెల 7వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ తెలిపారు. పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.